



# "కర్మ అంటే ఇదేనా?"

— రచన: "వినయశ్రీ" —

మనస్సు ఏమీ బాగుండలేదు. ఏమిటో చికాకుగా చీదరగా వుంది. ఎంత చించుకున్నా తోచిబడి కావడం లేదు. సిగరెట్టుమీద సిగరెట్టు కాలుస్తున్నా సంతృప్తిగాలేదు. హాయిగా వుండవలసిన సంధ్యవేళ డిమ్ముగా, గ్లూమీగా వుండడంవల్ల ఉక్కిరిబిక్కిరిగాఉక్కగా వుంది. వీటన్నిటికితోడు నాడు జరిగిన సంఘటన తెరలు తెరలుగా జ్ఞప్తికి రావడం బాధగా బరువుగా వుంది.

ఎంత అధికారి అయితే మాత్రం "నీలాంటి వెధవలువుంటే పనులెట్లా అవుతాయ్!" అంటాడా! నేనుమాత్రం ఏమంత తప్పుగా ప్రవర్తించాను. జరగనిపని గనుక "అది జరగదు సార్" అని ఖచ్చితంగా నరికినట్టు చెప్పాను. ఆ మాత్రం దానికి నోటికొచ్చినట్టు కూస్తాడా! నిజంగా అప్పుడు ఆ వ్యక్తి అధికారి అయిపోయాడు గాని మరొక వ్యక్తి అయివుంటే ఏమయ్యేదో! ఛీ ఛీ! ఏమిటీ తెలివితక్కువ ఆలోచనలు. అదే వేరొక వ్యక్తి అయితే అంత ధీమాగా ధైర్యంగా మాట్లాడగలడా! ఆలోచిస్తున్న కొద్దీ తల తిరిగిపోతుంది. ఎందుకైనా మంచిది కాస్త మనశ్శాంతి కోసం అలా బజారుమీదుగా పోతే బాగుంటుందని మునుచీకటిపడే ముందు బయల్దేరాను.

బజారులో నడుస్తున్నా నన్నమాటే గాని నా మనస్సు మనస్సులో లేదు. అడుగులో అడుగువేసుకుంటూ ఏదో నాలో నేనే వూహించుకుంటూ మంద మరుపుగా సాగిపోతూంది నా నడక. చర్‌మని ఒక్కసారి వెలిగాయి వీధి దీపాలు. "అరే అప్పుడేచీకటిపడిందా!" అని లైట్లవైపు చూస్తూ రెండడుగులు వేసానో లేదో నాకు రెండు గజాలదూరములో నడిరోడ్డుమీద మెరిసిందో వెండి బిళ్ల. అప్రయత్నంగా ఆగింది నానడక. వెంటనే దీక్షగా చూసాయి నా రెండు కళ్ళూ. "నో డౌట్" అది రూపాయే. అయితే నాకు వెంటనే సందేహం కలిగింది. ఇంతజనప్రవాహంలోఆరూపాయి ఎవరికంటా పడలేదా? ఒకవేళ చూసి కూడ వూరుకున్నారా? నా వెర్రికాకపోతే రూపాయి కనుపిస్తే తియ్యకుండా ఎవరూరుకుంటారు చెప్పండి? ఒకవేళ ఎవరైనా తమాషాకి అక్కడ పడేసి ప్రక్కనుంచి కనిపెడుతున్నారేమో? ఏడిసినట్టుంది నాఆలోచన. డబ్బుతో పరిహాసమేమిటి? ఇంతకూ నేనేం చెయ్యాను? ప్రశ్నించింది నామనస్సు. వెర్రివాడా తీసి జాగ్రత్తపెట్టు అంది నాబుద్ధి. వెంటనే నారెండుకళ్ళు చుట్టుపట్లవున్న జనాన్ని పరికించి, కాళ్లనుపురిగొల్పాయి రూపాయి దగ్గరకు నడవమని. అనుకోకుండానే నా రెండుకాళ్ళు రూపాయి దగ్గరకు వెళ్ళాయి. కాళ్ళంటే వెళ్ళాయి కాని రూపాయిని తీయాల్సింది చేతులుగనుక వణకడం మొదలు పెట్టేయి. ఈలోగా ఆ రూపాయిని మరొక రెవరైనా చూస్తారేమోనని నా కుడికాలుతో త్రొక్కిపెట్టి నుంచుని కంగారుగాపరికించాను చుట్టుపట్లవున్న జనాన్ని. నా కంగారును గాని, నేను అక్కడే నిలబడివుండడానికి గల కారణాన్నిగాని ఎవరూ పసిగట్టినట్టు లేదు. సరే ఇక తియ్యవచ్చు ననుకున్నాను. అనుకున్నానే గాని ఎప్పుడూ నాకు ఏ వస్తువా దొరకడంగాని, ఒక వేళ దొరికినా దొంగచాటుగా తియ్యడం గాని చేయలేదు కాబట్టి నా ముఖం ముచ్చెమటలతో నిండిపోయింది. ఎలాగైతేనేం మగవాడ్నన్న దృష్టిని మనస్సులోనికి జొనిపించి, జేబులోనున్న చేతి రుమాలు తీసి ముఖం తుడుచుకొని, దాన్ని నెమ్మదిగా క్రిందకు జారవిడచి, దాన్నితీసే మిషతో వంగి, రుమాలుతో పాటు రూపాయినిగూడ తీసి జేబులో వేసుకొని గబగబా నడక సాగించాను.

కొంతదూరం వెళ్ళాక "ఏయ్ రిక్షా" అప్రయత్నంగా కేకపెట్టింది నాగొంతుక. పిలచిందే తడవుగా ఆగింది ఓ రిక్షా నాముందు. "ఏమోయ్ గాంధీనగరం ఎల్. ఎఫ్. టి. బి. దగ్గరకు ఏమిమ్మంటావు?" అనడిగేను నేను. "అరణాలు యిప్పించండిబాబు" అన్నాడు దీనంగా. "ఏడిసినట్టుంది ఆరు ఫర్లాంగులైనా లేదు యిది, అరణాలు కావాలా?" ఖచ్చితంగా కొలిచినట్టు డబాయించాను. "రాత్రిపూట గదండీ?" అని అస్పష్టంగా గొణిగాడువాడు. రూపాయిలో అరణాలు పోతే మిగిలేది పదణాలు, ఇక రూపాయి దొరికినఫలితమేముంది. ఐనా ఎట్లానూ

పిలిచేను. గనుక "మూడణాలు యిస్తా" వస్తావా అన్నాను. "నావల్లకాదుబాబు" అంటూ వెళ్ళిపోయాడు వాడు. పోతే పోనియ్యి అనుకొని మళ్ళీ నడక సాగించాను. టక్కున స్ఫురించింది వారఫలితాల ప్రభావం. ఈ వారం వారఫలితాలలో "హఠత్ ధనరాబడి" అని వ్రాసి వుంది. అందుకే ఈ రూపాయి దొరకడానికి కారణమై వుంటుంది. లేకపోతే నాకెందుకు దొరుకుతుంది ఈ రూపాయి చెప్పండి? కొంతమంది వార ఫలితాల మీద నమ్మకం లేదంటూనే వార ఫలితాలను చూసుకుని సంతృప్తిపడుతూ వుంటారు. అట్లాంటివారిని గబ్బిలాల క్రింద జమకట్టినా తప్పులేదేమో! ఎవరో వీపుమీద చరిచారు తిరిగి చూసాను. ఇంకెవరు మిత్రుడు రాజారావు.

"ఏమిటోయ్ ఏదో ఆలోచిస్తున్నట్టుగా వున్నావు?" అన్నాడు.

"అబ్బే ఏమీ లేదు" ముభావంగా వూరుకున్నాను.

"ఇలా ఎక్కడనుంచి రాక" అని మళ్ళీ ప్రశ్నించాడు. "ఆఫీసునుండి" ముక్తసరిగా జబాబిచ్చాను. ఇలా మాటలాడుకుంటూనే పరమేశ్వరి టాకీస్ దగ్గరకు వచ్చేము. "కాఫీ తాగుదామా?" అడిగాడు. "ఇప్పుడేంకాఫీలెద్దు" ఇష్టం లేనట్టు ముఖం చిట్లిస్తూ అన్నాను. "డబ్బులు నే యిస్తాలేవోయ్ మరేం భయపడకు" అంటూనే స్వతంత్ర హోటల్‌లోనికి లాక్కెళ్ళాడు. ఇక తప్పిందిగాదు.

కేషియరుకు బిల్లుయిస్తూ నా జేబులోని రూపాయితీసి వాడిచేతిలోపెట్టాను. వాడు నావైపు ఎగా దిగా చూసి నవ్వి "చూడండి ఇలాంటి టోకరాలు యిక్కడ కాదు ఏ సినీమా టిక్కెట్లు కొనేటప్పుడైనా చేస్తే బాగుంటుంది" అన్నాడు. నివ్వరబోయి వాడివంక చూస్తున్నా "ఏం పెద్దమనుష్యు లండీ?" కొంచం సీరియస్‌గానే అన్నాడు. నేనేం మాట్లాడలేకపోయాను. పోనీ మరొక రూపాయి యిద్దామంటే నా దగ్గరలేదాయిరి. ఏం చెయ్యను? "ఏమయ్యా ఏమైంది?" అనడిగాడు పంపుదగ్గరనుంచి చేతులు తుడుచుకుంటూ వస్తున్న రాజారావు. "ఏమవుతుంది ఇదిగోచూడండి" రాజారావు చేతికిచ్చాడు. నిజంగా నాకు తీరని అవమానం. అక్కడివాళ్లంతా ఫక్కున నవ్వేరు సిగ్గుతో, లజ్జతో కుంగిపోయి, పొడుచుకు చావాలనిపించింది. పిచ్చెత్తినట్టయింది. కొయ్యలా నిల్చున్న నన్ను వీపు తట్టుతూ, తనలో తను చిన్నగా నవ్వుకొని వేరొక రూపాయి నిచ్చేడు రాజారావు. అతడు నవ్విన ఆనవ్వు నా హృదయాన్ని గుచ్చినట్టయింది. ఇద్దరూ నడుస్తున్నామన్నమాటే గాని ఎందుకో నాకు ఏడవాలనిపించింది. రాజారావే లేకుంటే నిజంగా గట్టిగా యేడ్చినా అవమానాన్ని మర్చిపోయుండేవాణ్ని. హాస్పిటల్ దగ్గఱకు వచ్చాక "వస్తారా బ్రదర్" అంటూ వెళ్లిపోయాడు మిత్రుడు రాజారావు.

ఛీ ఛీ! ఎంత అవమానం. ఆ వెధవ రూపాయి కనుపించకపోయినా బాగుండును. కనుపిస్తే మాత్రం నే నెందుకు తియ్యాలి? తీస్తేమాత్రం చూసుకోవద్దూ? జీవితంలో మర్చిపోలేని అవమానం. ఇంక నే నా స్వతంత్రహోటలుకి ఎప్పుడైనా వెళ్లగలనా? కనీసం నా ముఖం మళ్లీ ఆ కేషియర్‌కి చూపించగలనా? అమాంతంగా ఏడుపొచ్చింది. నాలో నేనే యేడ్చేను. ఏడ్చి ఏడ్చి తేలికబడ్డ హృదయంతో, కర్మ అంటే ఇలానే వుంటుంది కాబోలు నని వూహించుకుంటూ నా రూముకు జేరుకున్నాను. ఇంతవరకూ కర్మ అంటే తెలియని నాకు మీరే చెప్పండి కర్మ అంటే ఇదేనా? ★

# పై ఎత్తు

రచన : రావిపల్లివేంకటరావుపట్నాయిక్

మా మునసబుగారు ఠీవిగా కాలుమీద కాలువేసుక్కూచుంటూ చుట్టూ వున్న పంచాయితీదార్లతో ఇష్టాగోష్ఠిగా సంభాషిస్తున్నారు. అంతలో ఒక రైతు ఆతృతగా వచ్చి మునసబుగారితో "బాబూ! ఇందాక మీ ఎద్దొకటి వచ్చి మా ఎద్దుతో పోట్లాట ప్రారంభించిందండీ. రెండూ ఘోరంగా పోరాడాయి. వాటిని విడదీయడానికి వీల్లేకపోయింది. ఆ పోట్లాటలో మా ఎద్దు చచ్చిపోయిందండీ. అని విచారంగా చెప్పాడు.

"అయితే ఏంచెయ్యమంటావ్" అని ప్రశ్నించారు మున్సబుగారు.

"నా బ్రతుకంతా ఆ ఒక్క ఎద్దేనండీ. దానికే ఈ విఘాతము జరిగిందంటే మరి నేను బ్రతుకలేను బాబూ. ప్రభువులు ఏదో కొంత పరిహారమిప్పిస్తే ఇంకొక ఎద్దు కొనుక్కుంటాను" అని అతి వినయముగా ప్రార్థించాడు రైతు. పంచాయితీదార్లంతా మున్సబుగారేమని చెప్తారో అని ఆయనవేపే చూస్తున్నారు.

"అబ్బే! అదేం కుదరదే. మానవుల్లాగ పశుజాతికి వివేకం శూన్యంగాబట్టి వాటిలో వాటికి ఏ విఘాతాలొచ్చినా పరిహారాలూ, శిక్షలూ అంటూ ఏవీ వుండవు. న్యాయశాస్త్రములోనూ అంతే వుంది" మునసబుగారి తీర్పుకు అంతా విస్తుపోయారు.

సరిగ్గా అదేసమయానికి మున్సబుగారి పాలేరొకడు వచ్చి మున్సబుగారితో "బాబూ! మన ఎద్దొకటి పోట్లాటలో చచ్చిపోయింది. ఇప్పుడే చూసివచ్చాను" అని చెప్పాడు. అంతా వింటున్న నేను మున్సబుగారి తీర్పు ఇలా పరిణమిస్తుందని ముందే తెలుసును గాబట్టి "అందరికీ న్యాయశాస్త్ర మొక్కటే మరి" అని వ్యాఖ్యానించాను: నా "పై యెత్తు" పారినందుకు లోలోపల సంతోషిస్తూ. ★